ధ్రువపత్రాలకు ముందే మేలుకొలుపు

- ఉన్నత చదువుల ధ్రువపత్రాలకు ఇదే మంచి సమయం
- చివరి క్షణాల్లో హైరానా పడకుండా దరఖాస్తు చేసుకోమంటున్న అధికారులు



మంగళగిరి ఎమ్మార్వో కార్యాలయం

మంగళగిరి టౌన్: ఇంటర్మీడియట్, 10వ తరగతి తదితర పరీక్షా ఫలితాలు ఇటీవలే వెలువడ్డాయి. ఉన్నత చదువుల్లో భాగంగా కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు పలు ధ్రువపత్రాలు తప్పని సరి. వీటిని ముందస్తుగా పొందేందుకు ఇదే మంచి తరుణమని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో రానున్న విద్యార్థుల కోసం సంబంధిత కార్యాలయాల్లో అవసరమైన అన్ని పత్రాలు అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రక్రియ ఇలా..

ప్రస్తుతం చదువుతున్న తరగతుల నుంచి తదుపరి తరగతుల్లోకి ప్రవేశానికి ఆదాయం, కుల, ఈడబ్ల్యూయస్, ఓబీసీ వంటి ధ్రువపత్రాలు తప్పని సరి. వీటి కోసం విద్యార్థులు మీసేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్హత ధ్రువపత్రాలను ఆయా పరిధిలోని సచివాలయాల్లో డిజిట్ సహాయకుడికి ఇస్తే ఆన్‌లైన్ చేస్తారు. తరువాత వీఆర్వో క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను ఆన్‌లైన్ దరఖాస్తుకు జతచేసి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే మంజూరు నిమిత్తం తహసీల్దార్ ఆన్‌లైన్‌లో పంపుతారు. దరఖాస్తుకు సంబంధించిన అన్ని వివరాలు పరిశీలించిన తరువాత తహసీల్దార్ ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు. 2020–21 తరువాత ఎవరైనా కుల ధృవీకరణ తీసుకుంటే దానిపై ఉన్న నెంబర్ ఆధారంగా మళ్లీ తీసుకోవచ్చు. ఆదాయ ధ్రువపత్రాలు మాత్రం కొత్తగా అప్లయ్ చేసుకుని తీసుకోవాల్సిందే.

ఒత్తిడి పెరగకముందే..

సాధారణంగా మే, జూన్ నెలల్లో ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బందిపై ధ్రువపత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. దరఖాస్తు దారుల రద్దీ పెరుగుతూ ఉంటుంది. వీఆర్వో, ఆర్ఐ క్షేత్రస్థాయి పరిశీలన, డిజిటల్ సంతకాలు తదితర పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు పలు మార్లు తిరగాల్సి రావడం.. మధ్య వర్తులను ఆశ్రయించడం వంటి ఇబ్బందులు రావచ్చు. ఫలితంగా అనుకున్న సమయానికి ధ్రువపత్రాలు చేతికి అందకపోవచ్చు. ముందుగా మేల్కొంటే హైరానా తప్పుతుందని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి..



కళాశాలలు, వృత్తి విద్యాకోర్సుల్లో చేరే సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను ముందుగా సిద్ధం చేసుకుంటే మేలు. చివరి సమయంలో హడావుడి పడుతూ ఆందోళన చెందకుండా ప్రస్తుత సెలవుల్లోనే కార్యాలయాలను సంప్రదించాలి. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన సమయం కంటే ముందు వీటిని జారీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– దినేష్‌కుమార్, తహసీల్దార్, మంగళగిరి

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

నష్ట పరిహారం చెల్లించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం


సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మంగళగిరి టౌన్: అన్నమయ్య జిల్లా ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లింపు, పునరావాసం, లీజు బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం మంగళగిరి పట్టణంలోని సీసీఎల్ఏ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిర్వాసితులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో జూన్ 12వ తేదీ నుంచి నిరవధిక దీక్షలు చేస్తామని.. న్యాయం కోసం కోర్టుకు వెళతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తామన్న హామీని గుర్తు చేశారు. రూ. లక్షల కోట్లను వెచ్చించి రాజధాని నిర్మాణం చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. బాధితుల నష్ట పరిహారానికి రూ.200 కోట్లు లేవా అని ప్రశ్నించారు. రైతు కుటుంబాలు పస్తులతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సీపీఎం కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వాసితుల సంఘ నాయకులు రాజేష్, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూకు జీఎస్‌డీసీ అక్రిడిటిటేషన్ గుర్తింపు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి గ్లోబల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (జీఎస్‌డీసీ) అక్రిడిటిటేషన్ గుర్తింపు ఇచ్చినట్లు వర్సిటీ కెఎల్‌యూ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ మరో ముఖ్యమైన మైలురాయిని సాధించిందని.. దీంతో వర్సిటీలోని ఆచార్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారని.. దీనిలో భాగంగా అమెరికా, స్విట్జర్లాండ్, సింగపూర్‌లో ఉన్న జీఎస్‌డీసీ ద్వారా గుర్తింపు పొందిందని అన్నారు. జీఎస్‌డీసీ అనేది యుఎస్ఎ, స్విట్జర్లాండ్, సింగపూర్‌లలో ఉన్న ఒక సర్టిఫికేషన్, అక్రిడిటిటేషన్ సంస్థ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్, డెవ్‌ఆప్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, ఎజైల్, స్క్రమ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాలు గ్లోబల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అందించే సర్టిఫికేషన్ డొమైన్‌లలో ఉన్నాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


విపత్తుల నియంత్రణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెదకాకాని: మండల పరిధిలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో 10ఏ బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మంగళగిరి అగ్నిమాపక అధికారి వై.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అగ్నిమాపక పరికరాలు ఏ విధంగా వినియోగిస్తారో ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ సట్వాల్, వీవీఐటీయూ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్ డా.ఎ.శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మెలో 'మేము సైతం'

సమ్మె నోటీసును అందజేసిన సీఐటీయూ అనుబంధ హమాలీ, కార్మిక సంఘాల నేతలు


సహాయ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇస్తున్న నేతలు

తెనాలి: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్టు సీఐటీయూ అనుబంధ హమాలీ, కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. ఆ ప్రకారం కార్మిక సంఘాల నాయకులు వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలనీ, ఇంతకుముందు రద్దుచేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలనీ, జాతీయస్థాయిలో కనీసవేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి తెలియజేశారు. అంతేకాకుండా కాజువల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్, పీస్‌రేట్ పనివిధానాన్ని రద్దుచేయాలనీ, పెరుగుతున్న ధరలను అదుపుచేయాలనీ, ఈఎస్ఐ చట్టాలన్ని అమలు చేయాలని కార్మికసంఘాలు కోరుతున్నట్టు వెల్లడించారు. సమ్మె నోటీసును స్థానిక చెంచుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శికి షేక్ హుస్సేన్‌తోపాటు సీఐటీయూ నాయకుడు కేబీ ప్రసాద్, హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీహెచ్ ఆంజనేయులు అందజేశారు. ఏపీ సివిల్ సప్లయిస్, వేర్‌హౌస్, గోడౌన్ ఇన్‌చార్జికి హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.వెంకటరావు, సంగమేశ్వరరావు, షేక్ హుస్సేన్‌వలి సమ్మె నోటీసును ఇచ్చారు. అలాగే ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్, తెనాలి డివిజన్ మేనేజరుకూ సమ్మె నోటీసును అందించారు.

నేడు తెనాలిలో దివ్యాంగుల పరికరాల గుర్తింపు శిబిరం

తెనాలిఅర్బన్: కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పంపిణీ చేసే పరికరాల గుర్తింపు శిబిరా న్ని గురువారం తెనాలిలో నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. చేతికర్రలు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్‌లు, రోల్ టైర్స్, అంధుల చేతికర్ర, లెప్రెసి కిట్స్, కృత్రి మ అవయవాలు మొదలగు వాటిని ప్రభుత్వం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనిలో భాగంగా తెనాలిలో దివ్యాంగులకు పరీక్షలు జరిపి అవసరమైన పరికరాలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. క్యాంప్‌కు వచ్చే సమయంలో సదరమ్ సర్టిఫికెట్, తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, యూ నిక్ డిజైబుల్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫోటో లు, సెల్ ఫోన్ తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని తెనాలి నియోజకవర్గ పరిధిలో ఉన్న దివ్యాంగులు ఉపయోగించుకోవాలన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మంగారి ఆరాధనోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివార్లకు అర్చకులు కటకం వెంకటాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. అనంతరం మండపంలో గణపతిపూజ, కంకణ ధారణ, పుణ్యాహవాచనం, అఖండస్థాపన, నవగ్రహమండపారాధన, దేవతా ఆవాహనం నిర్వహించారు. స్వామివార్లకు అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

వేమవరంలో: గ్రామంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయంలో స్వామి ఆరాధన ఉత్సవాలను అర్చకులు అయ్యన్న శాస్త్రి నిర్వహించారు. ముఖ మండపంలో విశేష అర్చనలు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


బసవయ్య (ఫైల్ ఫొటో)

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణానికి చెందిన డి.బసవయ్య కనిపించడం లేదని బుధవారం కుటుంబ సభ్యులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బసవయ్య వయస్సు 76 సంవత్సరాలని.. సుమారు 6 అడుగుల ఎత్తు ఉంటారని, ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో తెల్లచొక్కా, తెల్లపంచె ధరించి ఉన్నారని తెలిపారు. ఆయనకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపారు. బసవయ్య ఆచూకీ తెలిస్తే 86888 31354, 86888 31359 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహిచారు. బుధవారం గ్రామంలోని రాజుల పాలెం వద్దగల సీతారామరాజు విగ్రహానికి యువ త పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన స్వాతంత్ర పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూసపాటి కొండ రాజు, కె. నరస రాజు, పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థుల ప్రవేశాలకు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు మున్సిపల్ హైస్కూల్స్‌లో రెండోస్థానంలో నిలిచింది. 13 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించగా, ఒకరు అత్యధికంగా 583 మార్కు లు కైవసం చేసుకున్నట్టు గుర్తుచేశారు. ఈ వివరాలను తెలియజేస్తూ ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ మైక్ రిక్షాలో వివరాలను వినిపించారు. ఎస్ఎంసీ చైర్మన్ గాలి కిరణ్, హరినాథ్, ఉపాధ్యాయులు ప్రసాద్, రాజకిషోర్, బసవేశ్వరరావు, బెల్లకొండ వెంకట్ పాల్గొన్నారు.

భాగవతోత్తములకు పురస్కారాలు అందజేత


వేంకటాచార్యస్వామిని సత్కరిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో బుధవారం భాగవతోత్తములకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వేంకటాచార్యులు మాట్లాడుతూ.. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి వారి మంగళ శాసనాలతో ఉభయ వేదాంత ప్రవర్తకాచార్యులు శ్రీమాన్ తూపురాణి ఉడయవర్లు స్వామివారి తిరు నక్షత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని వైదికంగా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించినటువంటి భాగవతోత్తములకు పురస్కార సమర్పణ మహోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది పురస్కార గ్రహీత ఉ.వే. శ్రీమాన్ కిడాంబి వేంకటాచార్య స్వామి వారికి (నెల్లూరు) పరమాంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి వారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి రామానుజ జీయర్‌స్వామి వారు ఇరువురూ ఉడయవర్లు దేశిక పురస్కారాన్ని సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో భాగవతోత్తములు, పెద్దలు, రఘునాథ చార్యస్వామి, భగవద్ బంధువులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లి రూరల్: దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరు రోడ్డులో ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులను కలసి, ఆటో డ్రైవర్స్, ఓనర్స్ సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత రాష్ట్ర ప్రభుత్వం 2019లో మోటార్ వాహనాల చట్టం సవరణ చేస్తూ అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచే విధంగా జీవో నెంబర్ 21 చట్టం చేసిందన్నారు. చిన్నచిన్న పొరపాట్లకు కూడా భారీ మొత్తంలో పెనాల్టీలను డ్రైవర్ల వద్ద నుంచి వసూలు చేసే విధంగా చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పలు మార్లు పెంచడం, నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరగడంతో రవాణా రంగ కార్మికులు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రాతూరు రోడ్డు ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు నల్లపు గోపి, యూనియన్ కార్యదర్శి చొక్కా బాలకృష్ణ, శివయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలపై వినతిపత్రం అందజేత


రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులు కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులు కృష్ణమోహన్‌ను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్ విసాక ఉద్యమ వేదిక నాయకులు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ వేదిక నాయకులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్ వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర స్థాయి సదస్సులో చేసిన తీర్మానాలను వినతి పత్రం రూపంలో అందజేశామని.. సానుకూలంగా స్పందించిన సంచాలకులు కృష్ణమోహన్ విజ్ఞాపనలను పరిశీలించి గ్రంథాలయ సంస్థ పక్షాన తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆలోచిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఏటా రాజా రామ్మోహన్‌రాయ్ ఫౌండేషన్ కలకత్తా వారి పుస్తకాల కొనుగోలు తాలూకా నిధులు విడుదల చేయాలని విజ్ఞాపన చేశామని అన్నారు. కార్యక్రమంలో ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్, కె.లక్ష్మయ్య, పల్లవి వెంకట నారాయణ, చలపాక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న సీడీపీవో ప్రసూన

తాడికొండ: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో పీజీ ప్రసూన అన్నారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లతా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లను చిన్నారులకు తెలియజేసి అవగాహన కల్పించాలన్నారు. మందడం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ సీతారావమ్మ మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే చట్టాలు, చిన్నారులు వేధింపులకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పెదకాకాని, మంగళగిరి మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్‌లు విజయలక్ష్మీ, ఎస్.నాగమణి, మహిళా పోలీసు లక్ష్మీ ప్రసన్న, ఏఎన్ఎం శాంతకుమారి, సంస్థ సిబ్బంది జె.ఇశ్రాయల్, అత్తోట పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జెండా స్తంభం విరగ్గొట్టిన దుండగులు


రోడ్డుపై పడేసిన జెండా పోల్ వద్ద శివసాంబిరెడ్డి, పార్టీ సభ్యులు

తెనాలి: రూరల్ మండల గ్రామం గుడివాడలోని అంబేడ్కర్ సెంటర్లోని సీపీఎం జెండా పోల్‌ను విరగ్గొట్టిన దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రూరల్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు, సీపీఎం పార్టీ అగ్రనాయకుడు ఏకే గోపాలన్ స్మారకార్థం నిర్మించిన స్థూపం వద్ద జెండా పోలీను బుధవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు విరగ్గొట్టి రోడ్డుపై పడేశారని ఆయన చెప్పారు. సీపీఎం పార్టీ స్థానిక సభ్యులు, సానుభూతిపరులతో కలిసి శివసాంబిరెడ్డి అక్కడకు వెళ్లారు. మే డే రోజున ఇద్దరు యువకులు మద్యం సేవించి అల్లరి చేశారని చెబుతూ, ఈ రోజు గుర్తుతెలియని వ్యక్తులు జెండాను అవమానించటం హేయమైన చర్యగా తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకుండా చూసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని స్థానికులు వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ చర్యను ఖండించాలని శివసాంబిరెడ్డి కోరారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకరరావు, బురదగుంట భాస్కరరావు, బండికళ్ల పసి తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి ధర్మారావుకు ఘననివాళి



తెనాలి: తెనాలి ప్రాంతానికి సుప్రసిద్ధ రాజకీయ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావు 22వ వర్ధంతిని బుధవారం జరిపారు. స్థానిక గంగానమ్మపేటలోని లక్ష్మీ డీలర్స్ సెంటర్లోని ధర్మారావు కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. న్యాయవాది, ఎమ్మెల్యే, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్, మంత్రిగా ధర్మారావు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆలపాటి మాధవరావు, జెట్టి అంకినీడు, డాక్టర్ ఏవీ ప్రసాద్, ఎం.దశరధరామిరెడ్డి, కాళిదాసు సత్యం, నల్లగొర్ల సాంబశివరావు, పి.సురేష్, పి.ఆదిత్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమ్మె నోటీసు అందజేత



తాడేపల్లి రూరల్: ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తాడేపల్లి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రకాష్‌నగర్ డ్రైవర్స్ కాలనీలోని ఆరోగ్య కేంద్రాలకు.. కుంచనపల్లిలోని ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లకు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్‌డీఏ కూటమి అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 20వ తేదీన సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ, రేణుక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి యాకోబు



తాడేపల్లి రూరల్: పేదల పక్షపాతి సప్పిడి యాకోబు వర్ధంతి సభను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం తాడేపల్లిలో సీపీఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా యాకోబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం జెండా కింద పేదల కోసం పనిచేసిన వ్యక్తి యాకోబు అని అన్నారు. వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై పనిచేయడమే గాక నివాస ప్రాంతాల్లో పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, బాబూరావు, బర్నబాస్, డి.వి.భాస్కర్‌రెడ్డి, ఎండీ బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరి సరికాదన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇమాంబి, నవనీతం, సారమ్మ, ఎం.ఆశీర్వాదం, నాగేశ్వరరావు, పిచ్చయ్య, హగ్గయ్య, సుభాని, దుర్గాభవాని, సువర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గాలిబాలి శాఖాగ్రంథాలయం తనిఖీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖాగ్రంథాలయంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సెక్రటరీ సుబ్బరత్తమ్మ తనిఖీ చేశారు. అటెండెన్స్, పుస్తకాల రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల గురించి ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పెరికల జేమ్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ తరగతుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఆమె అన్నారు.

ఉపాధి, హౌసింగ్ పనులపై సమీక్ష

దుగ్గిరాల: పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, నరేగా ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి, హౌసింగ్ పనులపై ఎంపీపీ షేక్.జబీన్ సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ దుగ్గిరాల సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా జబీన్ చేతుల మీదగా 'మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజల చేతుల్లో ప్రభుత్వం ' ప్రారంభించారు. 95523 00009 వాట్సాప్ నంబరుకి 'హాయ్' అని పంపడం ద్వారా 200 పౌరసేవలు పొందవచ్చునని ఆమె తెలిపారు. కొత్త జాబ్ కార్డు నమోదును గ్రామ సచివాలయంలో చేస్తారని తెలిపారు. ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉపాధి, హౌసింగ్ పనులును వేగవంతం చేయాలని సూచించారు.